క్లుప్తంగా

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి దిగుబడులను పరిశీలిస్తున్న ఏపీఎం ప్రసాద్

పాణ్యం: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఏపీఎం ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ దిగుబడుల ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఎరువులు, రసాయనాలను తగ్గించి ప్రకృతి సాగుపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. ఈ విధానంలో పండించే ఉత్పత్తుల వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కలగదన్నారు. మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఇంటి ఆవరణల్లో కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు.

భోజనాన్ని వృథా చేయొద్దు



కొణిదేడు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ-2

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని వృథా చేయవద్దని ఎంఈఓ-2 సుబ్రమణ్యం అన్నారు. సోమవారం కొణిదేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనం తింటున్న విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం లేకున్నా, బాగో లేకున్నా తెలియజేయాలని కోరారు. నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనం వడ్డించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బురాన్‌దొడ్డి విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో పీడీ సత్యరాజు

సి.బెళగల్: రాష్ట్రస్థాయి సైక్లింగ్, మల్కాంబ్ పోటీలకు బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం అబ్దుల్‌హకీం, పీడీ సత్యకుమార్ తెలిపారు. వివరాలను పీడీ వెల్లడిస్తూ.. సోమవారం కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. 9వ తరగతి విద్యార్థి రసూల్ సైక్లింగ్ పోటీలో, ఈశ్వర్ అనే విద్యార్థి మల్కాంబ్ క్రీడా పోటీలో ప్రతిభ కనపరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలియజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ ఎస్‌ఐ మణికంఠ

కోడుమూరు రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలను తప్పక పాటించాలని ట్రైనీ ఎస్‌ఐ మణికంఠ సూచించారు. సోమవారం కోడుమూరులో ట్రైనీ ఎస్‌ఐ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్స్ వంటి వాటిని కచ్చితంగా వెంట ఉంచుకోవాలని, బైక్ నడిపే వారు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని, ఎవరైనా రోడ్డు నిబంధన లు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు.

రైలు ఢీకొని గేట్ కీపర్ మృతి

కర్నూలు: రైల్వే గేట్ కీపర్‌గా పనిచేస్తున్న షేక్షావలి (56) రైలు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన కర్నూలు నుంచి అలంపూరుకు వెళ్లే రైల్వే మార్గం తుంగభద్ర బ్రిడ్జి పర్యవేక్షకుడు (కాపలాదారుడు)గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం చెకింగ్ పూర్తి చేసుకుని బ్రిడ్జి మీదుగా స్టేషన్‌కు నడుచుకుంటూ వస్తుండగా హైదరాబాదు వైపు నుంచి కర్నూలుకు వస్తున్న వైన్‌గంగ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు సంతానం. స్టేషన్ మాస్టర్ నజియా ముబీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచి మరిన్ని వైద్య సేవలను అందించడం కోసమే స్వస్థ నారీ- స్వశక్తి పరివార్‌ను ప్రభుత్వం తీసుకొచ్చినట్లు జేసీ డాక్టర్ బి.నవ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్వస్థ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్‌పై ముద్రించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం శక్తివంతమైన కుటుంబానికి కీలకమన్నారు. ఈ అభియాన్ ద్వారా మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగి పోషకాహారంపై శ్రద్ధ వహించి కుటుంబ స్థాయిలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎక్కడిక్కడ మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక వైద్యం అందిస్తారన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్‌ను పోషకాహార మాసంగా పాటిస్తూ పోషకాహారంతో కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వివరించాలని జేసీ డాక్టర్ బి.నవ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పోష్టికాహార మాసోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు పోషన్ మా వేడుకలను జిల్లాలోని 1886 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



సి.బెళగల్ పీజీఆర్‌ఎస్‌లో సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: రైతుల భూ సమస్యలను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటలక్ష్మి వీఆర్వోలను, సర్వే సహాయకులను హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ మండల అధికారులతో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కంబదహాల్, పోలకల్, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు భూముల కొలతలు చేపట్టాలని, ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించి భూములపై హక్కులు కల్పించాలని, ఆక్రమణల నుంచి రక్షణ కల్పించాలని, జాయింట్ ఎల్‌పీఎంలను తొలగించాలని తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. జాయింట్ ఎల్‌పీఎంల సమస్యలపై అధికంగా అర్జీలు రావడంపై తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందిపై మండిపడ్డారు. రైతుల అర్జీలను తొక్కిపెట్టి కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదన్నారు. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలున్న రైతులను వీఆర్వోలు, సర్వే సహాయకులు సంప్రదించి, ఆన్‌లైన్‌లో సబ్ డివిజన్‌కు దరఖాస్తు చేయించాలని ఆదేశించారు. ఏఓ మల్లేష్‌కుమార్, సర్వేయర్ నాగభూషణం, ఆర్‌ఐ తరుణ్, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో సైతం అధికారులు పీజీఆర్‌ఎస్‌ను నిర్వహించగా సి.బెళగల్ ఎస్సీ కాలనీకి చెందిన యువకులు కాలనీలో విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని అధికారులకు అర్జీ ఇచ్చారు. మండల పరిషత్ పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, ఉపాధి హామీ ఏపీఓ రామన్న తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లతో కార్మికులకు తీరని అన్యాయం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

కోడుమూరు రూరల్: కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న లేబర్‌కోడ్‌లతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు అన్నారు. సోమవారం గూడూరులో సీఐటీయూ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ.. 8 గంటల పని విధానం స్థానంలో పది గంటల పని విధానం తేవడం, మహిళలు కూడా నైట్ డ్యూటీలు చేయాలని తీర్మానించడం వల్ల కార్మికులను బానిసలుగా చేయడానికి కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. అధికారంలోకి రాకముందు కార్మికులకు అనేక హామీలిచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయకుండా కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని సూచించారు. అనంతరం గూడూరు సీఐటీయూ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శి గుంటప్ప, ఉపా ధ్యక్షులు రాజశేఖర్, మద్దిలేటి, శాంతన్న, సహాయ కార్యదర్శులు శేషమ్మ, ప్రభావతి, రాజులతో పాటు 21 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాహనమిత్రకు దరఖాస్తుల ఆహ్వానం

గడివేముల: మండలంలో సొంత ఆటోలు ఉన్నవారందరూ ఆయా సచివాలయాల్లో వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వాసు దేవగుప్తా సోమవారం తెలిపారు. ఆటో రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకుని ఈ నెల 17 నుంచి 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

కర్నూలు(సెంట్రల్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.5 వేలు సాయం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీశక్తి పథకం ఆటో డ్రైవర్ల ఆర్థిక స్థితిగతులను తీవ్రంగా ప్రభావం చేస్తోందన్నారు. ఎవరూ ఆటోలు ఎక్కడం లేదని ఆవేదన చెందారు. వాహన మిత్ర పథకాన్ని షరతులు లేకుండా అమలు చేయాలని, జీఓలు 21, 31లను రద్దు చేయాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను అడ్డుకోండి



అర్జీ ఇస్తున్న గొల్లలదొడ్డి వాసులు

సి.బెళగల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకుని, అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారని, ఆక్రమణలను అడ్డుకోవాలని ఆ గ్రామస్తులు అధికారులను కోరారు. సోమవారం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు చంద్రన్న, లోకేష్, ఖాజావలి, మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని పరిపాలన అధికారి శ్రీనివాసులుకు అర్జీ ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 137/1, 137/2 (ఎల్‌పీఎం నంబర్లు 3832, 3905) లలో 7.50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, కొందరు కబ్జాదారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని గృహ నిర్మాణాలు చేపట్టారన్నారు. మరికొందరు కల్లం దొడ్లను ఏర్పాటు చేసుకుంటున్నారని, దీంతో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడంతో పాటు గ్రామంలో ప్రభుత్వ అవసరాలకు, భవన నిర్మాణాలకు స్థలం లేకుండా పోతుందన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



సి.బెళగల్‌లో చెరువు బావిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మండల ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ సూచించారు. ఆయన సోమవారం మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, బ్యాతోలి, సి.బెళగల్ గ్రామాల్లో పర్యటించి మంచినీటి వనరులను, పథకాలను పరిశీలించి, ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఈ మధ్యకాలంలో పల్లెల్లో కురిసిన వర్షాలతో మంచి నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలను పాటించాలన్నారు. తాగునీటిని కాచి చల్లార్చిన తరువాతే తాగాలని, అదేవిధంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బ్యాతోలి గ్రామంలో మండల పరిషత్ నిధులు, సి.బెళగల్‌లో గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టిన మురికి కాలువల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు.

సీతారాం ఏచూరికి నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు(రూరల్): దేశాన్ని ఐక్యంగా నిలబెట్టడమే సీతారాం ఏచూరికి ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రామక్రిష్ణ అన్నారు. మండల పరిధిలోని గొందిపర్ల, ఇ.తాండ్రపాడు, ఉల్చాల గ్రామాల్లో సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం స్థానిక సీపీఎం నేతల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామక్రిష్ణ మాట్లాడుతూ.. ప్రపంచ మేధావులలో సీతారాం ఒకరని పేర్కొన్నారు. ఉన్నత కుటుంబంలో పుట్టి పేదల కోసం జీవితాన్ని అర్పించిన మహనీయుడని కొనియాడారు. ఇండియా కూటమి ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. బీజేపీ ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అనేక సందర్భాల్లో పిలుపునిచ్చారని గుర్తు చేశారు. సీపీఎం మండల కార్యాదర్శి హుసేనయ్య, నాయకులు రఘువేంద్ర, శ్రీరాములు, బాలపీరా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?



వర్కూరులో ఉల్లి దిగుబడులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్న ఉల్లి రైతుల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టవా? అని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ప్రశ్నించారు. సోమవారం మండలంలోని వర్కూరు గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించి రైతులు సాగు చేసిన ఉల్లి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఉల్లి సాగు చేస్తే తీరా దిగుబడి చేతికొచ్చిన తర్వాత ధర భారీగా పతనం కావడంతో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఉల్లి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర.. రైతులు పెట్టిన పెట్టుబడిలో సగం కూడా రావడం లేదని, ఇలాగైతే రైతులు ఎలా వ్యవసాయం చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిట్టుబాటు ధర లేక చాలామంది రైతులు ఉల్లిగడ్డలను కోయకుండా పొలాల్లోనే వదిలేసుకుంటున్నారని వాపోయారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఉల్లి దిగుబడులను అరికట్టి స్థానిక రైతులకు అవకాశం కల్పిస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న ఉల్లిని కర్నూలులో గాకుండా రైతుల పొలాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తే రైతన్నకు కనీసం రవాణా, కూలీ ఖర్చులైనా మిగులుతాయని, క్వింటాల్ ఉల్లి రూ.2500 ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాక్రిష్ణ, స్థానిక నాయకులు రాజు, గఫూర్ మియ్యా తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కాలేజీ సిబ్బంది

పాణ్యం: మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ అన్నారు. జాతీయ ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా సోమవారం కళాశాలలో ఆయన జయంతిని నిర్వహించారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయా కార్య క్రమాల్లో కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతి రాముడు, డైరెక్టర్ అశోక్ కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి

ఓర్వకల్లు: భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని నన్నూరు శాఖ గ్రంథాలయం అధికారిణి కౌసల్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు.

రైలు కింద పడి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ శివారులోని తుంగభద్ర బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు నుంచి అలంపూరుకు వెళ్లే రైలు మార్గంలో నేతాజీ కాంప్లెక్స్ రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాక్‌పై మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉండొచ్చని కుడి చేతికి కాషాయ రంగు దారం ఉంది. వెండి కడియం కూడా ధరించాడు. కడియంపై చిన్నవేలు మల్లమ్మ, నాగిమునెమ్మ, పెద్దవేలు మల్లేశ్వరుడు, మల్లికార్జున, బందన్న, పి అనే తెలుగు అక్షరం ఉన్నాయి. నలుపు రంగు అంగీ, తెలుపు రంగు బనియన్ ధరించాడు. లోయర్ జోన్‌లో తాళాల గుత్తి ఉంది. అందులో బజాజ్ కంపెనీకి చెందిన ఆటో తాళంచెవులు మూడు, ఇంటికి సంబంధించిన రెండు తాళంచెవులు ఉన్నాయి. మృతుడి వివరాలు తెలిసినవారు 99088 89696 లేదా 99859 37035 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆనవాళ్లను బట్టి మృతుడు ఆటోడ్రైవర్ అయి ఉండొచ్చని భావిస్తున్నారు.

In The Court of the Prl.Sr Civil Judge, Kurnool
I.P.No : 52/2025

Boya Laxmidevi ..Petitioner
-Vs-
Boya Krishna and Others ..Respondents

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కోడుమూరు(మం॥), కోడుమూరు గ్రామప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబర్ I.P.లో అర్జిదారురాలు అయిన బోయ లక్ష్మిదేవి భర్త తలారి బోయరాముడు ఇ.నం: 18-52-5, కొండపేట, కోడుమూరు(వి) & (మం), కర్నూలు (జిల్లా) అను ఆమె తనను దివాలా దారుగా తీర్మానించమని దివాలా అర్జీ(I.P) దాఖలు చేసినారు. ఇందుపైన ఎవరికైన ఆక్షేపణ ఉన్న 8.10.2025 తేదిన పగలు : 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యస్.విజయమోహన్,
యన్.యం.కృష్ణమోహన్,
యం.త్రివిక్రమ్,
ఎ.రాజేష్,
సి.వెంకట అరుణ్,
అర్జిదారుల పరం అడ్వకేట్లు, కర్నూలు,
సెల్: 97013 92123.

మురుగుతో దుర్గంధం



రోడ్డుపై ఉన్న మురుగును చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: మండల కేంద్రంలోని కాలనీలో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు సుధాకరప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సీపీఎం బృందం చెన్నమ్మ సర్కిల్ నుంచి పందిపాడు వెళ్లే ప్రధాన రోడ్డులో సుఖీభవ ఆస్పత్రి ఎదురుగా ఉన్న మురుగును పరిశీలించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 15 రోజులుగా డ్రైనేజీ కాలువ బ్లాక్ కావడంతో మురుగునీరు మొత్తం రోడ్డుపైకి వస్తోందని తెలిపారు. దీంతో దోమలు, ఈగలు, లార్వాలకు నెలవుగా మారిందన్నారు. అలాగే పందులు కూడా తిరుగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆనంద్, హుస్సేన్ బాషా, రామాంజనేయులు, రాజు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

ఓర్వకల్లు: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పవర్ జెన్‌కో కార్మికులు సత్యనారాయణ, పోలయ్య, భరత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నన్నూరు సమీపంలోని 400 కేవీ సబ్ స్టేషన్ ఎదుట కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తరహాలో విద్యుత్ కార్మికులను జెన్‌కో సంస్థలో విలీనం చేసి దశలవారీగా రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా సుప్రీంకోర్టు సూచించిన విధంగా సమాన పనికి, సమాన వేతనం అందజేయాలన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన అరియర్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు సంజయ్, సునీల్, లక్ష్మయ్య, మహ్మద్, రాజు, రఘురామయ్య, సుబ్బయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ ఏజెన్సీ దక్కించుకునేందుకు ఘర్షణ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ ఏజెన్సీ సబ్ లీజుకు తీసుకునేందుకు ఇద్దరు ప్రజాప్రతినిధులకు చెందిన వర్గాల మధ్య గొడవ తారాస్థాయికి చేరింది. సోమవారం ఆసుపత్రిలోని సెక్యూరిటీ ఏజెన్సీ కార్యాలయానికి ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరు వచ్చి అక్కడున్న వారితో గొడవ పడ్డారు. ప్రస్తుతం సెక్యూరిటీ టెండర్‌ను ఈగల్ హంటర్ సొల్యూషన్స్ అనే సంస్థ మూడు నెలల క్రితం దక్కించుకుంది. ఈ సంస్థ నుంచి సబ్ లీజుకు తీసుకునేందుకు కోడుమూరు నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడి వర్గం ప్రయత్నించి సఫలమైంది. ఆసుపత్రి మా నియోజకవర్గంలో ఉందని, వేరే నియోజకవర్గం వారు వచ్చి ఎలా పని చేస్తారంటూ మరో వర్గం నెల రోజులుగా ఘర్షణ పడుతోంది. గత నెలలో రాత్రివేళ కార్యాలయానికి వచ్చి ఫర్నీచర్‌ను విసిరిపడేసి బీభత్సం సృష్టించారు. తాజాగా ఇదే వర్గం మళ్లీ కార్యాలయానికి వచ్చి తమకు బాధ్యతలు అప్పజెప్పాలని గొడవ చేశారు. విషయం తెలిసిన మూడో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిచి మాట్లాడి పంపినట్లు సమాచారం.

26న మంత్రాలయం పీఠాధిపతి రాక



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఈనెల 26వ తేదీన కోడుమూరుకు విచ్చేస్తున్నట్లు అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు భాస్కర్‌రెడ్డి తెలియజేశారు. సోమవారం కోడుమూరులో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో కమిటీ సభ్యులు మంత్రాలయం పీఠాధిపతి రాకకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించడంతో పాటు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హిందూ ధార్మిక ప్రవచనాలు, ఆధ్యాత్మిక సందేశం ఇస్తారన్నారు. కావున ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఖరీఫ్ సాగు అంతంత మాత్రమే!

- సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు.. ఇప్పటివరకు సాగైంది 3.56 లక్షల హెక్టార్లు
- గతేడాది ఇదే సమయానికి 4.08 లక్షల హెక్టార్లలో సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నప్పటికీ పంటల సాగు అంతంత మాత్రంగానే ఉండిపోయింది. ముందస్తుగా వర్షాలు మొదలయినప్పటికీ కీలకమైన జూన్, జూలై నెలల్లో వర్షాలు అంతంత మాత్రానికే పరిమితం కావడంతో సాగు తగ్గినట్లు స్పష్టమవుతోంది. జూన్, జూలై నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వల్లనే ఖరీఫ్ పంటల సాగులో పురోగతి లేదనే విషయం స్పష్టమవుతోంది. ఖరీఫ్ సాధారణ పంటల సాగు విస్తీర్ణం 4,22,631 హెక్టార్లు ఉంది. అయితే ఇప్పటివరకు 3,56,196 హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 4.08 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావడం విశేషం. 2024 ఖరీఫ్‌తో పోలిస్తే 2025లో సాగు భారీగా తగ్గడం ఆందోళన కలిగించే విషయం. గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల వేరుశనగ, మిర్చి, పొగాకు సాగు తగ్గింది. అత్యధికంగా పత్తి 2,21,714 హెక్టార్లలో సాగయ్యింది. వేరుశనగ 28,660, ఉల్లి 11,703, మిర్చి 9,577, టమాట 1,811, కంది 40,289 ఆముదం 9,585, సజ్జ 5,756. మొక్కజొన్న 7,248, కొర్ర 2,723 హెక్టార్లలో సాగయ్యాయి.